దేశంలో మంకీపాక్స్ నిర్ధారణ

- విదేశాల నుంచి వచ్చిన వ్యక్తికి వైరస్ ఉన్నట్టు గుర్తింపు
- క్లేడ్ 2 రకం వైరస్‌గా గుర్తింపు
- రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: మంకీపాక్స్ (ఎంపాక్స్) పెద్ద ఎత్తున వ్యాప్తి చెందుతున్న ఆఫ్రికా దేశం నుంచి ఇటీవల భారత్‌కు వచ్చిన ఓ వ్యక్తికి 'ఎంపాక్స్' ఉందని నిర్ధారణ అయింది. రోగికి పశ్చిమ ఆఫ్రికా క్లేడ్-2 రకం వైరస్ ఉందని గుర్తించినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం తెలిపింది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల ప్రకటించిన ప్రజారోగ్య అత్యయికి స్థితికి కారణమైన క్లేడ్ 1 రకానికి చెందిన కేసు కాదని, ఆందోళన అక్కర్లేదని తెలిపింది. భారత్‌లో 2022 జూలై తర్వాత 30 ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. అలాంటిదే ఈ కేసు కూడా అని కేంద్రం పేర్కొన్నది. ఎంపాక్స్ సోకిన వ్యక్తి ప్రస్తుతం ఐసోలేషన్‌లో ఉన్నాడని, అతడి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని తెలిపింది. ఎంపాక్స్ వైరస్‌కు సంబంధించి.. ప్రస్తుతం మనదేశంలో ప్రజలకు ఎలాంటి ముప్పు లేదని, వైరస్ వ్యాప్తిపై నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నామని వెల్లడించింది. ఆఫ్రికాలోని పలు దేశాల్లో ఎంపాక్స్ రెండో వేవ్ మొదలవ్వటంతో, ప్రజా ఆరోగ్యంపై గత నెలలో డబ్ల్యూహెచ్‌వో అంతర్జాతీయంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. మరోవైపు, మంకీపాక్స్‌పై రాష్ట్రాలను కేంద్రం అప్రమత్తం చేసింది. ఎంపాక్స్ అనుమానిత కేసుల స్క్రీనింగ్, టెస్టింగ్‌లను నిర్వహించాలని, అలాగే వ్యాధి నిర్ధారిత, అనుమానిత రోగులకు అవసర మయ్యే ఐసోలేషన్ సౌకర్యాలు కల్పించాలని అడ్వైజరీ జారీ చేసింది. ప్రజల్లో ఎలాంటి భయాందోళనలకు తావివ్వకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరింది.

చైనాలో మరో కొత్త వైరస్

- జింజౌప్రావిన్స్‌లో బట్టబయలు
- మెదడుపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: మెదడు సంబంధిత వ్యాధులను కలుగజేసే మరో కొత్త వైరస్ చైనాలో వెలుగుచూసింది. చైనాలోని జింజౌ ప్రావిన్స్‌లో 2019లోనే బయటపడిన ఈ వైరస్‌ను వెట్‌ల్యాండ్ వైరస్ (వెల్వ్)గా పేర్కొంటున్నారు. వెస్ట్‌ల్యాండ్‌లోని ఓ పార్కును సందర్శించిన వ్యక్తికి ఈ వైరస్ మొదటిసారి సోకినట్టు మీడియా కథనాలు పేర్కొన్నాయి. మంగోలియాలోని వెస్ట్‌ల్యాండ్ పార్కులో కీటకం బారిన పడిన వ్యక్తి తీవ్రమైన జ్వరం, శరీర అవయవాలు పనిచేయకపోవడం వంటి లక్షణాలతో దవాఖానలో చేరాడని న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్ పత్రిక ఈ నెల 4న ఒక కథనాన్ని ప్రచురించింది. ఆ తరువాత ఆ పార్కును సందర్శించిన వారు లేదా అవే వ్యాధి లక్షణాలున్న వారిని పరీక్షించగా మరో 17 మందికి ఈ వైరస్ సోకినట్టు నిర్ధారణ అయినట్టు ఆ పత్రిక తెలిపింది. వైరస్ సోకినవారందరికీ ఒకే విధమైన లక్షణాలు లేవని వైద్యనిపుణులు పేర్కొన్నారు. చాలా మందిలో జ్వరం, అలసట, కండ్లు తిరగటం, తలనొప్పి, వెన్నునొప్పి, కీళ్ల నొప్పులు, నరాల బలహీనత వంటి లక్షణాలు కనిపించాయని తెలిపారు. కొందరి శరీరంపై చిన్నగా, గుండ్రంగా ఎరుపు లేదా ఊదారంగులో మచ్చలు వచ్చాయని పేర్కొన్నారు. ఒక రోగిలో అత్యంత అరుదైన మెదడు సంబంధిత నరాల బలహీనత కనిపించిందని తెలిపారు. తమ అధ్యయనంలో వెల్వ్-ఆర్ఎన్ఏ వైరస్‌ను గొర్రెలు, గుర్రాలు, పందుల్లో కూడా కనుగొన్నామని పేర్కొన్నారు.

వచ్చే నెల నుంచి రైతులకు ఆధార్ తరహా ఐడీలు

న్యూఢిల్లీ: ఆధార్ తరహాలో దేశంలోని రైతులందరికీ ఒక ప్రత్యేక ఐడీని జారీచేసేందుకు కేంద్రం కసరత్తు ప్రారంభించింది. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేసేందుకు ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా చేపట్టనున్నట్టు వ్యవసాయ శాఖ కార్యదర్శి దేవేశ్ చతుర్వేది సోమవారం తెలిపారు. అక్టోబర్ మొదటి వారంలో నమోదును ప్రారంభిస్తామని చెప్పారు. ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన రూ.2,817 కోట్ల డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కార్యక్రమంలో భాగంగా వచ్చే ఏడాది మార్చి నాటికి ఐదు కోట్ల మంది రైతులకు ఈ ఐడీలు జారీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. ఈ ఐడీ ద్వారా రైతులకు వివిధ వ్యవసాయ పథకాలు, కిసాన్ క్రెడిట్ కార్డు వంటివి సులభంగా అందుతాయని చెప్పారు.

స్కిల్స్ పెంచుకుంటేనే కొలువు సేఫ్

- భారీగా లేఆఫ్‌లు ప్రకటిస్తున్న టెక్ సంస్థలు
- వేలాది మంది టెక్ ఉద్యోగులకు ఉద్వాసన
- టెకీలు అప్రమత్తం కావాల్సిన సమయం
- నైపుణ్యాలు పెంచుకోకపోతే పింక్ స్లిప్ ఖాయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: సాఫ్ట్‌వేర్ జాబ్ అంటే ఐదంకెలతో మొదలయ్యే జీతం. వారానికి ఐదు రోజులే పని. అద్దాల భవనాల్లో ఉద్యోగం. అద్భుతమైన భవిష్యత్తు. ఇప్పటివరకు అందరిలో ఉన్న భావన ఇదే. అందుకే, మన దేశంలో ఇంజినీరింగ్ కోర్సులకు ఉండే డిమాండ్ అంతాఇంతా కాదు. అయితే, ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఐటీ ఉద్యోగమంటే తుమ్మితే ఊడిపడే ముక్కు అనే పరిస్థితులు వచ్చేశాయి. ఎప్పుడు 'పింక్ స్లిప్' వస్తుందో అనే ఆందోళన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు కలవరపరుస్తున్నది. కరోనాతో మొదలైన లేఆఫ్‌ల సీజన్ ఇప్పుడు ఏఐ రాకతో పీక్స్‌కు చేరింది. తాజాగా యాపిల్, సిస్కో, ఐబీఎం, ఇన్‌టెల్ వంటి టెక్ దిగ్గజ సంస్థలు 27,000 మంది ఉద్యోగులను ఇంటికి పంపించాయి.

భారీగా ఐటీ ఉద్యోగాల కోత

ఐటీ రంగంలో గత రెండుమూడేండ్లుగా కంపెనీలు భారీగా లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. తాజాగా ఇంటెల్ సంస్థ 10 బిలియన్ డాలర్లను ఆదా చేయాలనే లక్ష్యంతో 15 వేల మంది ఉద్యోగాలు ఊడగొట్టింది. ఏఐపై దృష్టి సారించడానికి యాపిల్ 100 మంది ఉద్యోగులను తొలగించింది. ఏఐ, సైబర్‌సెక్యూరిటీ నైపుణ్యాలు లేని 6,000 మంది ఉద్యోగులను సిస్కో సంస్థ తప్పించింది. ఐబీఎం సంస్థ చైనాలో ఆర్ అండ్ బీ కేంద్రాన్ని మూసేయడంతో వెయ్యి మంది ఉద్యోగాలు పోయాయి. ఇవన్నీ దిగ్గజ సంస్థలు. ఇక, చిన్న చిన్న కంపెనీలు తొలగిస్తున్న ఉద్యోగుల లెక్కే లేదు. 'ప్రాజెక్ట్ అయిపోయింది.. ఇక పని లేదు' అనే మాట ఏ రోజున వినాల్సి వస్తుందో అనే భయం ఐటీ ఉద్యోగుల్లో నెలకొన్నది. మంచి వేతనాలు ఉన్నాయనే ఆలోచనతో లోన్లపై ఇండ్లు, కార్లు కొన్న వారైతే మరింత కలవరపడుతున్నారు.

స్కిల్స్ పెంచుకుంటేనే ఫ్యూచర్

ఐటీ ఉద్యోగులు, ఈ రంగంలోకి వచ్చే విద్యార్థులు తాజా లేఆఫ్‌లను చూసి అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. సంప్రదాయ ఐటీ నైపుణ్యాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ తగ్గిపోతున్నదని, ఇంకా అవే పాత స్కిల్స్‌తో ఉద్యోగంలో కొనసాగడం దినదిన గండమే అని అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్, డాటా అనలటిక్స్, బ్లాక్ చెయిన్ వంటి రంగాలు ప్రధాన భూమిక పోషించబోతున్నాయని చెప్తున్నారు. ఐటీ రంగంలో భవిష్యత్తు బాగుండాలని ఆశించే ఉద్యోగులు, విద్యార్థులు వీటికి సంబంధించిన నైపుణ్యాలను పెంచుకోవాలని సూచిస్తున్నారు.

నైపుణ్యాలు పొందేందుకు అనేక మార్గాలు

ఐటీ రంగంలోని ఉద్యోగులు, ఈ రంగంలోకి ప్రవేశించనున్న విద్యార్థులు టెక్నాలజీలో వస్తున్న భారీ మార్పులను గుర్తించాలని, భవిష్యత్తులో డిమాండ్ ఉండే నైపుణ్యాలను గుర్తించి శిక్షణ పొందడం ద్వారా ఉద్యోగ భద్రతను పొందాలని నిపుణులు చెప్తున్నారు. ఇందుకుగానూ ఆన్‌లైన్‌లో అనేక ఎడ్యూటెక్ సంస్థలు ఇస్తున్న కోర్సులను పొందవచ్చని లేదా ఇన్‌స్టిట్యూట్‌లలో అయినా శిక్షణ పొందవచ్చని సూచిస్తున్నారు. కొన్ని కంపెనీలే ఉద్యోగులకు కొత్త నైపుణ్యాలు నేర్పేందుకు శిక్షణ ఇప్పిస్తున్నాయని, ఈ అవకాశం ఉన్నవారు తప్పనిసరిగా వినియోగించుకోవాలని చెప్తున్నారు. హ్యాకథాన్ వంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని, ఇప్పటికే ఆయా నైపుణ్యాలతో పని చేస్తున్న వారి నుంచి ప్రాక్టికల్ నాలెడ్జ్ పొందాలని సూచిస్తున్నారు.

వరద నీటిలో కారు టాప్‌పై 2 గంటలు!

గాంధీనగర్: గుజరాత్‌లో వచ్చిన భారీ వరదల్లో ఒక జంట కారులో చిక్కుకుపోయి ఎట్టకేలకు ప్రాణాలతో బయటపడింది. సబర్కాంత జిల్లాలో కరోల్ నది పొంగడంతో ఆదివారం వచ్చిన భారీ వరదల్లో ఒక వ్యక్తి తన భార్యతో కారులో చిక్కుకుపోయారు. వరద నీరు ముంచెత్తడంతో భార్యాభర్తలు ఎలాగోలా కారు టాప్‌పైకి చేరుకున్నారు. కారు మొత్తం మునిగిపోయి కేవలం టాప్ మాత్రమే బయటకు కన్పించింది. అయితే రెండు గంటల పాటు అలా టాప్‌పైనే ఉన్నప్పటికీ వారు ఎలాంటి ఆందోళన లేకుండా కూర్చోవడం స్థానికులను ఆశ్చర్యపరిచింది. ఎట్టకేలకు సహాయ బృందాలు వారిని రక్షించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చాయి. తాము కారులో నదిని దాటుతుండగా హఠాత్తుగా పెరిగిన నదీ ప్రవాహంతో కారు 1.5 కి.మీ కొట్టుకుపోయిందని బాధితుడు సురేష్ మిస్త్రీ తెలిపారు.

కేంద్ర మంత్రి బూట్లు తీసి.. పైజామా సవరించి

ఉన్నతాధికారి నిర్వాకం

రాంచీ, సెప్టెంబర్ 9: కేంద్ర మంత్రి సతీష్ చంద్ర దూబే జార్ఖండ్ పర్యటన వివాదంగా మారింది. ధన్‌బాద్ పర్యటనలో కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్) జనరల్ మేనేజర్ అరిందం ముస్తాఫీ మంత్రి బూట్లను తీయడం, ఆయన పైజామా బొందును సరిచేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ధన్‌బాద్‌కు విచ్చేసిన కేంద్ర బొగ్గు శాఖ సహాయ మంత్రి సోఫాలో రిలాక్స్ అయి ఉండగా, ఆయన బూట్లను జీఎం తొలగించడమే కాక, వాటిని అధికారులకు అప్పగించిన దృశ్యాలు వీడియోలో రికార్డయ్యాయి. కాగా, ఇది చాలా అవమానకరమని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. తమ అవినీతి పనులను కప్పిపుచ్చడానికే బీసీసీఎల్ అధికారులు ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించింది.

50 చంద్రకంపాలను గుర్తించిన చంద్రయాన-3

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: చంద్రుడి ఉపరితలంపై 250కి పైగా సెస్మిక్ సిగ్నళ్లను చంద్రయాన-3 గుర్తించింది. దీంతో ఇప్పటివరకు ఎక్కువ సెస్మిక్ సిగ్నళ్లను గుర్తించిన మిషన్‌గా చంద్రయాన-3 గుర్తింపు పొందింది. చంద్రయాన-3లో భాగంగా విక్రమ్ ల్యాండర్ ద్వారా చంద్రుడిపైకి పంపించిన ఇన్‌స్ట్రుమెంట్ ఫర్ లూనార్ సెస్మిక్ యాక్టివిటీ(ఐఎల్ఎస్ఏ) చంద్రుడిపై సెస్మిక్ సిగ్నళ్లను గుర్తించింది. ఈ 250 సిగ్నళ్లలో 200 వరకు ప్రజ్ఞాన్ రోవర్ కదలికలకు సంబంధించినవి కాగా, 50 సిగ్నళ్లు మాత్రం భిన్నమైనవిగా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇవి చంద్రుడి ఉపరితలంపై సంభవించిన ప్రకంపనలు అయి ఉంటాయని భావిస్తున్నారు. చంద్రుడి దక్షిణ ధృవం నుంచి సెస్మిక్ డాటాను సేకరించడం ఇదే తొలిసారి.

రాత్రి మేల్కొనే వాళ్లకు డయాబెటిస్ ముప్పు

నెదర్లాండ్స్ పరిశోధకుల వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: రాత్రి సమయంలో త్వరగా పడుకొని.. పొద్దునే లేచే వ్యక్తులతో పోల్చితే, రాత్రంతా మేల్కొనేవాళ్లు టైప్-2 డయాబెటిస్ బారినపడే ముప్పు 46 శాతం ఎక్కువ అని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. డయాబెటిస్ రావడానికి జీవన శైలి ఒక్కటే కారణం కాదని, అధిక బీఎంఐ (బాడీ మాస్ ఇండెక్స్), పెద్ద పొట్ట, శరీరంలో అధిక కొవ్వులు.. ఇవన్నీ టైప్-2 డయాబెటిస్‌ను కలుగజేయడంలో 50శాతం పాత్ర వహిస్తాయని నెదర్లాండ్స్ పరిశోధకులు తేల్చారు. మూడు రకాలైన నిద్ర సమయాల్ని కలిగిన 5 వేల మందిపై నెదర్లాండ్స్ 'లైడెన్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్' సైంటిస్టులు పరిశోధన చేశారు. నిద్రపోతున్న తీరుతో మన శరీరంలో జీవ గడియారం ప్రభావితం కాగానే, అది జీవ క్రియల్ని ఆటంక పరుస్తున్నదని, ఇది టైప్-2 డయాబెటిస్‌కు దారితీస్తున్నదని పరిశోధకుడు జిరోన్ వాన్ డెర్ వెల్డె చెప్పారు.

అన్ని కొవిడ్ వేరియంట్లను ఎదుర్కొనే యాంటీబాడీ!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: ఇప్పటివరకు పుట్టుకొచ్చిన కొవిడ్ వైరస్‌ల న్నింటి నుంచి రక్షణ కల్పించే 'సార్వత్రిక టీకా' తయారీ దిశగా యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. అన్ని రకాల కొవిడ్ వేరియంట్లను ఎదుర్కొనే యాంటీబాడీలను పరిశోధకులు గుర్తించారు. కరోనా పేషెంట్ల ప్లాస్మా నుంచి సేకరించిన 'ఎస్‌సీ27' యాంటీబాడీ.. అన్ని రకాల వేరియంట్లను ఎదుర్కొంటున్నదని పరిశోధకులు తెలిపారు. 'ప్రస్తుతం, భవిష్యత్తులో వచ్చే వైరస్‌ల నుంచి మానవాళిని రక్షించేందుకు ఎస్‌సీ27, ఇతర యాంటీబాడీల ఆవిష్కరణ ఎంతగానో దోహదపడుతుంది' అని పరిశోధకుడు జాసన్ లావిండర్ చెప్పారు.

ఫైనాన్షియల్ టైమ్స్ టాప్ 100లో 14 భారతీయ సంస్థలు

న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ టైమ్స్ మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్ గ్లోబల్ ర్యాంకింగ్స్, 2024లో భారతీయ బిజినెస్ స్కూల్స్ ర్యాంకులను సాధించాయి. ప్రపంచంలోని టాప్-100 సంస్థల్లో మన దేశానికి చెందిన 14 విద్యా సంస్థలు చోటు దక్కించుకున్నాయి. ఎస్‌పీ జైన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ రిసెర్చ్ (ఎస్‌పీజేఐఎంఆర్)కు 35వ ర్యాంకు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ (ఐఐఎం-ఏ)కు 39వ ర్యాంకు; ఐఐఎం, బెంగళూరుకు 41వ ర్యాంకు లభించాయి. స్విట్జర్లాండ్‌లోని సెయింట్ గాల్లెన్ వర్సిటీ ప్రథమ స్థానంలో నిలిచింది.

హర్యానాలో కాంగ్రెస్‌తో ఆప్ పొత్తు లేనట్టే!

న్యూఢిల్లీ: హర్యానా శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్ మధ్య పొత్తు దాదాపు లేనట్టే కనిపిస్తున్నది. సోమవారం 20 మంది అభ్యర్థులతో ఆప్ తొలి జాబితాను విడుదల చేసింది. ఎన్నికల్లో పొత్తు కోసం రెండు పార్టీల మధ్య పలు దఫాలు చర్చలు జరిగినా సీట్లు సర్దుబాటుపై ఏకాభిప్రాయం కుదరలేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఆప్ 10 స్థానాలను కోరుతుండగా, ఐదు స్థానాలను ఇచ్చేందుకు కాంగ్రెస్ సుముఖంగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఆప్ హర్యానా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సుశీల్ గుప్తా సోమవారం మాట్లాడుతూ, సాయంత్రానికి కాంగ్రెస్‌తో పొత్తు కుదరకపోతే, తాము మొత్తం 90 స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పారు.

ఏడాది ఆఖరులో జెలెన్‌స్కీ భారత్ పర్యటన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ఏడాది చివరలో భారత్‌లో పర్యటించే అవకాశాలున్నాయని భారత్‌లోని ఉక్రెయిన్ అంబాసిడర్ ఒలెక్సాండర్ పోలిషుచుక్ సోమవారం తెలిపారు. రష్యాతో యుద్ధానికి అంతం పలికేందుకు జరిగే శాంతి శిఖరాగ్ర చర్చల్లో భారత్ పాల్గొంటుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇటీవల మోదీ ఉక్రెయిన్ పర్యటనలో తమ దేశంలో పర్యటించాలని జెలెన్‌స్కీని కోరారన్నారు. మోదీ ఆహ్వానం మేరకు తమ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ఏడాది ఆఖరులో భారత్‌కు విచ్చేస్తారన్నారు.

గంజాయి సాగుకు గ్రీన్ సిగ్నల్!

- హిమాచల్ కాంగ్రెస్ సర్కారు నిర్ణయం
- ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కే యోచన
- 'గ్యారెంటీ' కష్టాలకు గంజాయితో చెక్
- ఏడాదికి 2 వేల కోట్ల ఆదాయమే లక్ష్యం



షిమ్ల, సెప్టెంబర్ 9: గ్యారెంటీల ప్రభావంతో ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్న హిమాచల్ ప్రదేశ్‌ను బయటకు తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ సర్కారు సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నియంత్రిత పద్ధతిలో గంజాయి సాగు చేసేందుకు అనుమతించాలని భావిస్తున్నది. ఈ దిశగా ఇప్పటికే కసరత్తు ప్రారంభమైంది. ఈ నిర్ణయాన్ని ప్రతిపక్ష బీజేపీ సైతం వ్యతిరేకించకపోవడం గమనార్హం. రాష్ట్రంలో గంజాయి సాగుకు గత ఏడాది అసెంబ్లీలో చర్చ జరిగింది. అధికార, ప్రతిపక్షాల సూచన మేరకు రెవెన్యూ శాఖ మంత్రి జగత్ సింగ్ నేగి నేతృత్వంలో శాస్త్రవేత్తలు, ఉద్యానవన నిపుణులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పీకర్ ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ నివేదికను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఔషధ, శాస్త్రీయ, పారిశ్రామిక అవసరాల కోసం నియంత్రిత పద్ధతిలో గంజాయి సాగు చేయాలని నిపుణుల బృందం ప్రతిపాదన చేసినట్టు మంత్రి నేగి తెలిపారు. గంజాయి సాగు సులభం కాబట్టి దీనికి ప్రజల మద్దతు కూడా ఉందని చెప్పారు. ఈ తీర్మానాన్ని అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించినట్టు చెప్పారు. గంజాయి సాగుకు అనుమతించేందుకు నార్కోటిక్ నిబంధనలను(ఎన్‌డీపీఎస్ చట్టం) సవరించాలని నిపుణుల కమిటీ సూచించినట్టు తెలిపారు.

ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కేందుకే

కాంగ్రెస్ నేతృత్వంలోని హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 10 గ్యారెంటీలు ఇవ్వడంతో రాష్ట్రం మరింత దివాలా తీసింది. దీంతో ఇటీవల పలు సబ్సిడీలకు ప్రభుత్వం కోతలు పెడుతున్నది. ఉద్యోగుల వేతనాలు, పింఛన్లను కూడా సమయానికి ఇవ్వలేదు. వేతనాలు ఆలస్యంగా ఇస్తే రాష్ట్రానికి నెలకు రూ.30 కోట్ల వడ్డీ మిగులుతుందని స్వయంగా ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు అసెంబ్లీలో చెప్పారంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందుల నుంచి గంజాయి సాగు కొంతమేరకు గట్టెక్కిస్తుందని ప్రభుత్వం భావిస్తున్నది. గంజాయి సాగుతో ఏడాదికి రూ.2,000 కోట్ల ఆదాయం రావొచ్చని గతంలో సీఎం సుఖు వ్యాఖ్యానించారు.

విద్యుత్తు వినియోగంపై పాలు, పర్యావరణ సెస్

రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన హిమాచల్ కాంగ్రెస్ సర్కారు.. దాన్నుంచి బయటపడేందుకు ప్రజలపై పన్నుల భారం మోపుతున్నది. ఇప్పటికే పలు సబ్సిడీలకు కోతపెట్టిన సుఖ్‌విందర్ సుఖు ప్రభుత్వం.. తాజాగా విద్యుత్తు వినియోగంపై పాలు, పర్యావరణ సెస్‌లను విధించేందుకు సిద్ధమవుతున్నది. ముఖ్యమంత్రి సుఖు ఈ మేరకు 'ది హిమాచల్ ప్రదేశ్ ఎలక్ట్రిసిటీ (డ్యూటీ) అమెండ్‌మెంట్ బిల్లు, 2024'ను శాసనసభలో సోమవారం ప్రవేశపెట్టారు. ప్రజలు వినియోగించే ఒక యూనిట్ విద్యుత్తుకు 10 పైసలు పాల సెస్ విధించాలని ప్రతిపాదించారు. చిన్నతరహా పరిశ్రమలు వినియోగించే ఒక్కొక్క యూనిట్ విద్యుత్తుకు 2 పైసలు చొప్పున, మధ్యతరహా పరిశ్రమలకు 4 పైసల చొప్పున, భారీ పరిశ్రమలకు 10 పైసల చొప్పున సెస్ విధించాలని ప్రతిపాదించారు.

పోస్టుమార్టం చలాన్ ఏమైంది?

- కోల్‌కతా హత్యాచార ఘటన విచారణలో సుప్రీంకోర్టు ప్రశ్న
- వైద్యులు వెంటనే విధుల్లో చేరాలని సూచన

న్యూఢిల్లీ: కోల్‌కతా ట్రైనీ వైద్యురాలి హత్యాచార ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు అప్పగించే సమయంలో రాసే ఫామ్(చలాన్)ను పశ్చిమ బెంగాల్ పోలీసులు సుప్రీంకోర్టుకు సమర్పించలేదు. ఈ అంశంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సోమవారం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం విచారణ జరిపింది. అయితే, పోస్టుమార్టంకు అప్పగించేటప్పుడు మృతదేహంతో పాటు ఏయే వస్తువులను వైద్యులకు ఇస్తున్నారనేది రాసే చలాన్ కనిపించడం లేదని న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. చలాన్ ఏమైందని పశ్చిమ బెంగాల్ తరపు న్యాయవాది కపిల్ సిబల్‌ను ప్రశ్నించగా, తన వద్ద ఉన్న డాక్యుమెంట్లలో లేదని చెప్పారు. ఈ చలాన్ కనిపించడం లేదంటే, ఏదో తప్పు జరిగి ఉంటుందని భావించాల్సి వస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. దీనిపై సమాధానం చెప్పాలని సీబీఐ, బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిరసన చేస్తున్న వైద్యులు సోమవారం సాయంత్రం 5 గంటల కల్లా విధుల్లో చేరాలని కోర్టు సూచించింది.

హిందూయేతరులకు, రొహింగ్యాలకు ప్రవేశం నిషిద్ధం!

ఉత్తరాఖండ్‌లోని గ్రామాల్లో బోర్డులు

డెహ్రాడూన్, సెప్టెంబర్ 9: ఉత్తరాఖండ్‌లోని కొన్ని గ్రామాల ప్రవేశ మార్గాల వద్ద ఏర్పాటైన బోర్డులు మత వివాదాన్ని రేపాయి. 'హిందూయేతరులు, రొహింగ్యా ముస్లింలు, వీధి వ్యాపారులు గ్రామంలో తిరుగుతూ వ్యాపారం చేయడం నిషేధం. ఎవరైనా అలా తిరుగుతూ కనిపిస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయి' అని హిందీలో రాసిన బోర్డుల్లో పేర్కొన్నారు. గ్రామసభ ఆదేశాల మేరకు ఈ బోర్డులు ఏర్పాటైనట్టు వాటిలో తెలిపారు. రుద్రప్రయాగ్ జిల్లాలో పలుచోట్ల వెలిసిన ఈ బోర్డులపై రాష్ట్ర డీజీపీ అభినవ్ కుమార్ స్పందిస్తూ స్థానిక పోలీసులు, దర్యాప్తు యూనిట్‌ను ఈ విషయమై దర్యాప్తు చేయాలని ఆదేశించామన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూడాలని గ్రామ్ ప్రధాన్‌ల కు(గ్రామాల అధిపతులు) సమన్లు జారీ చేశామని తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్

కాళింది ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

కాన్పూర్, సెప్టెంబర్ 9: యూపీలో భివాండి-ప్రయాగ్‌రాజ్ కాళింది ఎక్స్‌ప్రెస్‌కు కాన్పూర్‌లో పెను ప్రమాదం తప్పింది. ట్రాక్‌పై ఉంచిన గ్యాస్ సిలిండర్‌ను రైలు ఢీకొంది. అయితే రైలుకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. రైలును పట్టాలు తప్పించడానికి జరిగిన విద్రోహ చర్యగా దీనిని భావిస్తున్నామని, ఘటనా స్థలిలో ఒక పెట్రోల్ బాటిల్, అగ్గిపెట్టెను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి 8.20 గంటలకు రైలు అతివేగంతో వెళ్తుండగా, పట్టాలపై ఎల్పీజీ సిలిండర్ ఉండటాన్ని గమనించిన లోకో పైలెట్ ఎమర్జెన్సీ బ్రేకులు ప్రయోగించారు. అయినప్పటికీ రైలు సిలిండర్‌ను ఢీకొనడంతో అది పట్టాలకు దూరంగా ఎగిరిపడింది. ఘటనపై కేసు నమోదైందని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీస్ అధికారి చెప్పారు.

కాలిఫోర్నియాలోని రన్నింగ్ స్ప్రింగ్స్ హైవే 330 వద్ద ఎగసిపడుతున్న కార్చిచ్చు

కాలిఫోర్నియా, నెవాడాలో కార్చిచ్చు

వాషింగ్టన్, సెప్టెంబర్ 9: అమెరికాలోని కాలిఫోర్నియా, నెవాడా రాష్ట్రాల్లోని అటవీ ప్రాంతాల్లో చెలరేగిన కార్చిచ్చు భీకర రూపం దాల్చింది. లాస్ ఏంజెల్స్‌కు తూర్పున అటవీ ప్రాంతంలో, నెవాడాలోని ఇక్కడి రీజినల్ పార్క్‌లో చెలరేగిన మంటలు అదుపు తప్పాయి. దీంతో చుట్టుపక్కల ప్రాంతాలకు భయంకరమైన వేడి గాలులు వీస్తున్నాయి. ఆదివారం కాలిఫోర్నియాలో, నెవాడాలోని వాషూ కౌంటీలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. రెనోలో 20వేల మందిని మరోచోటకు తరలించాల్సి వచ్చింది. దాదాపు 100 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పేందుకు కృషి చేస్తున్నారని తెలిసింది. రెండు రాష్ట్రాల్లోని ప్రభావిత ప్రాంతాల్